నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 20 జనవరి 2025 | SANGAREDDY

# ప్రపంచానికి బౌద్ధం అవసరం

## బుద్ధ విహార్ ప్రారంభంలో హరీశ్‌రావు



బుద్ధ విహార్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 19: సిద్దిపేటలో బుద్ధ విహార్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో బుద్ధ విహార మైత్రి సంఘం ఆధ్వర్యంలో న్యాయవాది ఉప్పర మల్లేశం ఇంటి పైభాగంలో ఏర్పాటు చేసిన బుద్ధ విహార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... మనదేశంతో పాటు ప్రపంచానికి బౌద్ధం ఎంతో అవసరమని, బౌద్ధంలో శాంతిమార్గాలు ఉన్నాయని తెలిపారు. మనమందరం వాటిని పాటించాలన్నారు. బుద్ధ విహారం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి ముత్యాల నరసింహులు, ఉపాధ్యక్షురాలు వాగమరే సునీత, శ్రీనివాస్ గౌడ్, బుద్ధిస్ట్ సభ్యులు అనిల్ రెడ్డి, భీమ్‌రావు, మొగులాజి, మన్నె సాయి బాబా, బౌద్ధ బిక్షు మోక్షానంద్, బౌద్ధ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# డీసీసీబీ డైరెక్టర్ రాంచంద్రం మృతి



రామచంద్రం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మృతదేహానికి నివాళులర్పించిన హరీశ్‌రావు
- ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన

చిన్నకోడూరు, జనవరి 19: సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ, డీసీసీబీ డైరెక్టర్ నముండ్ల రాంచంద్రం ఆదివారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. 20 ఏండ్లుగా తనతో ఉన్న అనుబంధాన్ని హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి బాధాకరమని, పార్టీకి తీరని లోటు అన్నారు. సర్పంచ్‌గా, అల్లీపూర్ సొసైటీ డైరెక్టర్‌గా గ్రామ స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి, ఎంపీపీ, జడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్‌గా సేవలు అందించారని గుర్తుచేశారు. ఎప్పుడూ ప్రజాసేవ, అభివృద్ధి గురించే పరితపించే ఒక మంచి నాయకుడిని కోల్పోయామని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి పనిచేశారని గుర్తుచేశారు. రాంచంద్రం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, మూర్తి బాల్‌రెడ్డి, వేడికాయల వెంకటేశం, రాజేందర్, సొసైటీ చైర్మన్లు సదానందం గౌడ్, కనకరాజు, యువజన విభాగం మండల అధ్యక్షుడు వేణు, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 19: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం మానుకొని సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు జాబితా విడుదల చేసిందన్నారు. అర్హులైనవారికి రేషన్ కార్డులను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, నగేశ్, ఎం.ఏ.నజీబ్, పరశురామ్, చన్‌బసప్ప, పార్శెట్టి సంగప్ప, ముజామిల్, విఠల్, సుదర్శన్‌రావు, ఉబేద్, దస్తగిరి ఉన్నారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పాపన్నపేట, జనవరి 19: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి గ్రామంలో ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వివరాల ప్రకారం.. పొడ్చన్‌పల్లికి చెందిన అరిగే కృష్ణ కూతురు సింధూజ (19) మెదక్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. నెలరోజులుగా కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో దిగులుగా ఉంటున్నది. కళాశాలకు వెళ్లాలని కుటుంబీకులు కోరడంతో ఆవేశానికి గురైన సింధూజ శనివారం మధ్యాహ్నం ఇంట్లో కుటుంబీకులు ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబీకులు గమనించి మెదక్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శనివారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

# కేసీఆర్‌ను కలిసిన కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, జనవరి 19: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ కమలాకర్ రెడ్డికి శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మిరుదొడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తో తోట కమలాకర్‌రెడ్డి

# జనం ఫుల్.. బస్సులు నిల్

## ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్

- గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్సులు కోసం అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- స్టేజీలలో ఆపకుండానే వెళ్తున్న బస్సు సర్వీసులు



హద్నూర్‌లో ప్రయాణికులు ఎక్కేందుకు వీలు లేకుండా ఉన్న నారాయణఖేడ్ డిపో ఆర్టీసీ బస్సు



జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సంగారెడ్డి వెళ్లేందుకు బస్సు టాప్‌పై ఎక్కుతున్న మహిళ

జహీరాబాద్, జనవరి 19: విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా సంక్రాంతి పండుగకు తరలిరావడంతో గ్రామాలు కళకళలాడాయి. వారంతా తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, ఝరాసంగం తదితర మండల ప్రాంతాలకు పిల్లా పాపలతో కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులు రావడంతో కిక్కిరిపోయాయి. హైదరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, తాండూర్, వికారాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు వెళ్లేందుకు సరిపడా బస్సులను నడపక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో 92 ఆర్టీసీ బస్సుల్లో 63 ఆర్టీసీ బస్సులు, 29 ప్రైవేటు బస్సులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎలాంటి రుసుం చెల్లించకుండా రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత ప్రయాణించే అవకాశం కల్పించింది. ఫలితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. కానీ, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపక పోవడంతో గంటల తరబడి బస్సుల కోసం ప్రయాణికులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ గుండా హైదరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, తాండూర్, నిజామాబాద్, వికారాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన అరకొర బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పిల్లాపాపలతో పాటు లగేజీతో బస్సులో ఎక్కేందుకు వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సీట్లు దొరకడం ఏమో కానీ నిల్చుండి వెళ్లేందుకు కూడా బస్సులో చోటు దొరకడం గగనంగా మారింది. బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. గంటల తరబడి వేచి చూడడం కంటే వచ్చిన బస్సులో ఎలాగైన వెళ్లాల్సిందే అని ఆదివారం జహీరాబాద్ బస్టాండ్‌లో తాండూర్ వైపు వెళ్తున్న బస్సు టాప్‌పైకి మహిళ ఎక్కి కూర్చుంది. న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాల పరిధిలో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయా మండలాల మీదుగా జహీరాబాద్, నారాయణఖేడ్, తాండూర్, హైదరాబాద్, ఝరాసంగం తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే బస్సుల్లో ప్రయాణికులు నిండిపోవడంతో స్టేజీల వద్ద ఆగకుండా వెళ్తున్నాయి. దీంతో ఆటోలు, జీపులను ఆశ్రయించి వెళ్తున్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఉండడంతో మహిళలు బస్సులోనే ప్రయాణిస్తున్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

# ఆయిల్‌పామ్ రైతులకు డబ్బులు చెల్లించాలి

- ఈజీఎస్ పనులు వెంటనే ప్రారంభించాలి
- ఆత్మీయ భరోసాకు అర్హులనే గుర్తించాలి
- జిల్లా అంతటా పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తా..
- సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట, జనవరి 19: ఆయిల్‌పామ్ రైతులకు డబ్బులు వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశించారు. ఆదివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఈజీఎస్ పనులపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఈజీఎస్‌లో మంజూరైన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల పను లు ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్ రైతులకు వచ్చే డబ్బులు పెండింగ్ పెట్టవద్దని, ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. ఈజీఎస్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. క్యాటెల్ షెడ్స్, పౌల్ట్రీ ఫామ్స్, బోర్‌వెల్స్, ఇంకుడు గుంతలు పనులు కొనసాగించాలన్నారు. నర్సరీల నిర్వహణ, పల్లె ప్రకృతి నిర్వహణ లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మీయ భరోసాకు అర్హులైన కూలీలను గుర్తించాలని, అర్హులకు నష్టం చేకూరవద్దని సూచించారు.

### ఎస్సెస్సీ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపాలి

సిద్దిపేట జిల్లా ఐదేండ్లుగా పదోతరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచిందని, అదే పంథాతో ముందుకు పోవాలని హరీశ్‌రావు సూచించారు. ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా స్థానాన్ని కాపాడాలని, దానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. ఎస్సెస్సీ విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగుతుల్లో అల్పాహారం ఏర్పాటు చేస్తానని, వారం రోజుల్లో తానే స్వయంగా ఏదైనా స్కూల్‌లో ప్రారంభిస్తానని చెప్పారు. అందుకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గతేడాది తాను సిద్దిపేట నియోజకవర్గం వరకే స్నాక్స్ ఏర్పాటు చేశానని, ఈసారి జిల్లా అంతటా విద్యార్థులకు స్నాక్స్ అందిస్తానని హరీశ్‌రావు తెలిపారు.

### వెయ్యి పడకల దవాఖాన అందుబాటులోకి తేవాలి

సిద్దిపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సిద్దిపేటలో వెయ్యి పడకల దవాఖానను నిర్మించామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ పనులపై ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రూ. 170 కోట్లు పనులు పూర్తికాగా, ఇంకా రూ.40 కోట్ల పనులు మిగిలిపోయాయని, వెంటనే పనులు పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలని కోరారు. రూ.40 కోట్లతో సిద్దిపేటలో నర్సింగ్ కళాశాలను మంజూరు చేసుకున్నామని, వేగం గా పనులు పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తేవాలన్నారు. మెడికల్ కళాశాల పీజీ హాస్టల్ పనులు పూర్తిచేయాలన్నారు. ఆయుష్ దవాఖానకు ప్రహరీ పనులు చేపట్టాలన్నారు. సిద్దిపేటలో గత ప్రభుత్వంలో టూటౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ భవనాలు మంజూరు చేసుకున్నామని, వెంటనే పనులు చేపట్టాలని, త్రీ టౌన్ నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని అధికారులకు హరీశ్‌రావు ఆదేశించారు.

# పట్నం.. పరవశం

- కొమురవెల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- వైభవంగా పట్నం వారం.. 50వేల మంది భక్తులు హాజరు
- నేడు పట్నం, అగ్నిగుండం



రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, జనవరి 19: గజ్జెల లాగులు... ఢమరుక నాదాలు... డోలు చప్పులు... అర్చకుల పూజలు... ఒగ్గు పూజారుల పట్నాలు.. పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల సమర్పణతో మల్లన్న క్షేత్రం పులకించిపోయింది. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన పట్నం వారానికి 50 వేల మంది వరకు భక్తులు హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి వారాన్ని పట్నం వారంగా పిలువడం ఆనవాయితీ. పట్నం వారానికి హైదరాబాద్ భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, పెద్దపట్నం వేసి అగ్నిగుండం దాటుతారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన బంధువులు, స్నేహితులతో కలిసి దర్శించుకున్నారు. ఉత్సవాలకు శనివారం నుంచే భక్తులు కొమురవెల్లి క్షేత్రానికి రావడం ప్రారంభమైంది. ధర్మ దర్శనానికి 4గంటలు, ప్రత్యేక దర్శనానికి 2.30 గంటలు, శీఘ్రదర్శనానికి 4 గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో రామాంజనేయులు, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. అద్దె గదుల వద్ద చిలుకపట్నం, గంగరేగు చెట్టు వద్ద నజరు పట్నం, మహా మండపంలో ముఖమండప పట్నాలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ తదితర జిల్లాల నుంచి వచ్చే దారులన్నీ కొమురవెల్లి క్షేత్రం వైపు కొనసాగాయి. సోమవారం మల్లన్న ఆలయవర్గాల సహకారంతో హైదరాబాద్ ఒగ్గు పూజారుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ భక్తులు మల్లన్న క్షేత్రంలోని కల్యాణ వేదిక వద్ద పెద్ద పట్నం వేసి అగ్నిగుండం తయారు చేస్తారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండం దాటి స్వామి వారిని మరోసారి దర్శించుకుంటారు. అనంతరం నల్లపోచమ్మ, కొండపోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడ అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



# మల్లన్న క్షేత్రంలో భక్తులకు తిప్పలు

## ప్రైవేటు గదులకు రూ.10వేలు వసూలు.. ఆలయ పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు

- మురికిమయంగా మారిన కోనేరు
- అధిక ధరలకు కొబ్బరికాయల విక్రయాలు
- రూ.50 నుంచి 100 వసూలు చేసిన క్షురకులు
- సమస్యలు పట్టని పాలక మండలి సభ్యులు




మల్లన్న క్షేత్రంలో తిని పారేసిన ప్లాస్టిక్ ప్లేట్లు

చేర్యాల, జనవరి 19: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామిలో ఆలయంలో ఆదివారం జరిగిన పట్నం వారానికి వచ్చిన భక్తులకు తిప్పలు తప్పలేదు. బస చేసేందుకు గదులు లభించక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ నిర్వహణలో ఉన్న కాటేజీల్లో డోనర్స్ రావడంతో ఆలయవర్గాలు వారికే గదులను కేటాయించారు. దీంతో సామాన్య భక్తులు ప్రైవేటు గదులను ఆశ్రయించడంతో నిర్వాహకులు ధరలను అమాంతం పెంచారు. గదుల్లో ఉన్న వసతులను బట్టి రూ.10వేల నుంచి 8వేలు, 6వేల వరకు భక్తుల నుంచి వసూలు చేశారు. అంత డబ్బులు భరించలేని భక్తులు క్షేత్రంలోని చెట్ల వద్ద, తాము వచ్చిన వాహనాలు, ఆరుబయట తదితర ప్రదేశాల్లో బస ఏర్పాట్లు చేసుకున్నారు. నీటి వసతి కల్పించక పోవడంతో ఆలయానికి సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి రూ.20 చెల్లించి స్నానాలు చేశారు. మరో రూ.20 చెల్లించి బిందెడు నీరు తెచ్చుకున్నారు. రూ.50 చెల్లించి డబ్బా తాగునీటిని బసచేసిన ప్రాంతానికి భక్తులు తెచ్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకు పోవడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. పలువురు దాతలు అన్నదానం చేశారు. భక్తులకు ప్లాస్టిక్ ప్లేట్లలో ప్రసాదం, పాయసం, అన్నం అందజేశారు. వాటిని తిన్న అనంతరం కొందరు భక్తులు అక్కడే పడేయగా, మరికొందరు భక్తులు ఇతర ప్రదేశాల్లో ప్లేట్లు పడేయడంతో పరిసరాలు చెత్తమయంగా మారాయి. టెంకాయల విక్రయదారులు రూ.40కి ఒకటి చొప్పున విక్రయించారు. తలనీలాలు సమర్పించేందుకు కల్యాణకట్టకు వెళ్లిన భక్తుల నుంచి క్షురకులు రూ. 100, రూ.50 వసూలు చేశారు.

### మంత్రుల సమీక్షించినా...

కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం, భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అధికారులతో నిర్వహించిన సమీక్షల్లో పలుమార్లు ప్రకటించారు. కానీ, ఆదివారం ఆ పరిస్థితి కనిపించలేదు. భక్తులకు గదులు లభించలేదు. దర్శనానికి గంటల పాటు క్యూలో నిలబడాల్సి వచ్చింది. కోనేరులో నీరు మురికిగా మారడంతో భక్తులు అసౌక్యానికి గురయ్యారు. కోనేరులో నీటిని శుద్ధి చేసే యంత్రం అలంకారప్రాయంగా మారింది. అన్నదాన సత్రం తదితర ప్రదేశాల్లోని షవర్ల వద్ద మహిళలు స్నానాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. షవర్ల వద్ద ఎలాంటి పరదాలు ఏర్పాటు చేయలేదు. శీఘ్ర దర్శనం, కోనేరులో నీరు శుభ్రత, భక్తులకు భోజనం, తాగునీటి వసతి తదితర వసతులు కల్పించడంలో ఆలయ పాలక మండలి విఫలమైనట్లు భక్తులు ఆరోపించారు. కొందరు పాలక మండలి సభ్యులు ఆలయ ప్రసాదాల శాలలోని ఓ గదిలో కూర్చుని దర్శనం పాస్‌లు ఇచ్చే పనిలో నిమగ్నం కావడం విమర్శలు వ్యక్తమయ్యాయి. గతంలో విధులు నిర్వహించిన పాలకమండలి సభ్యులు దర్శనం పాస్‌లను అధికారులకు అప్పగించి, వారు ఇతరత్రా పనులు చూసుకునేవారని, ప్రస్తుత పాలక మండలి సభ్యులు భక్తులకు సేవలు అందించడంపై దృష్టిసారించడం లేదనే విమర్శలు ఉన్నాయి.



మురికిమయంగా మారిన కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

# రైతుభరోసాకు కోతలు!

- క్షేత్రస్థాయి సర్వే ఆధారంగానే రైతుభరోసా చెల్లింపులు
- సర్వేలో నిమగ్నమైన అధికారులు
- 21 నుంచి 24 వరకు గ్రామ సభల్లో లబ్ధిదారుల గుర్తింపు

మెదక్, జనవరి 19(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా రెండు పంటల సాగుకు రైతుబంధు అందించి చేయూతనిచ్చిన సంగతి తెలిసిందే. రైతుబంధు రావడంతో రైతులు సాగుకు అప్పులు చేయాల్సిన కష్టాలు తీరాయి. బీఆర్‌ఎస్ ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా రైతులందరికీ రైతుబంధు అందించింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ధరణితో సంబంధం లేకుండా రైతుభరోసా జాబితాను సిద్ధం చేస్తున్నది. ఇందులో పరిశ్రమలు నెలకొల్పిన భూములను, కోళ్లఫారాలు, పెట్రోల్ బంకులు, ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, వ్యవసాయేతర భూములు(నాలా)గా నమోదైన అన్ని రకాల భూములు, ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించిన రియల్ ఎస్టేట్ వెంచర్ల భూముల వివరాలు రైతుభరోసా జాబితా నుంచి తొలిగించడానికి యత్నిస్తున్నారు. దీనికోసం అధికారులు పొలం బాట పట్టారు. మెదక్ జిల్లాలో 391 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 3.80 లక్షల ఎకరాల వరకు భూములు ఉన్నాయి. సాగు భూములకే పెట్టుబడి సాయం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వేనంబర్ల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారా.. లేదా అనే వివరాలు సేకరిస్తున్నారు. గతంలో రైతుబంధు రెండు పంటలకు ఎకరాకు రూ. 10వేల చొప్పున బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించగా, రైతుబంధు స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాగా ఎకరాకు రూ.12వేల చొప్పున అందించాలని భావిస్తోంది. రైతు భరోసా చెల్లింపుల్లో పారదర్శకత ఉండాలనే లక్ష్యంతో క్షేత్ర స్థాయి సర్వేలో సేకరించిన వివరాలను ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో వెల్లడిస్తారు. ఇందు లో అర్హత కలిగిన రైతుల వివరాలను ప్రకటించి జనవరి 26 నుంచి రైతుభరోసా అందించాలని భావిస్తున్నారు. గ్రామసభల్లో వచ్చిన అభ్యంతరాలను అధికారులు పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ సర్వేలో ఎంతమం దికి రైతుభరోసా అందనుందో వేచి చూడాల్సిందే.

### 20 వరకు సర్వే పూర్తి...

ఈనెల 20వరకు క్షేత్రస్థాయి సర్వే పూర్తవుతుంది. జిల్లాలో గుర్తించిన సాగుకు యోగ్యమైన భూముల వివరాలను గ్రామసభల్లో వెల్లడిస్తాం. జిల్లాలో 76 మంది ఏఈవోలు, 21మంది ఎంఏవోలు సర్వేలో పాల్గొంటున్నారు.

– వినయ్‌కుమార్, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి, మెదక్

# దివ్యాంగురాలు సజీవ దహనం



మృతురాలు కంది ప్రేమల (ఫైల్)

కల్హేర్, జనవరి 19: పుట్టిన నుంచి ఒక చేయి, ఒక కాలు పనిచేయక గెంటుకుంటూ పనులు చేసుకునేది. కన్న తండ్రి బతికి ఉన్నప్పుడు బాగోగులు చూసేవారు. పదిహేనేండ్ల క్రితం కన్న తండ్రి కాటికి పోయినప్పటి నుంచి దిక్కులేని బతుకుదెరువుతో జీవనం గడుపుతున్నది. చిన్న రేకుల షెడ్‌లో బతుకు వెళ్లదీసింది. శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దివ్యాంగురాలు సజీవ దహనమైన ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం నాగ్‌ధర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై వెంకటేశం వివరాల ప్రకారం.. నాగ్‌ధర్ గ్రామానికి చెందిన కంద్రి లింగయ్యకు కొడుకు జీవరత్నం, కూతురు కంది ప్రేమల (45) సంతానం. కంది ప్రేమల పుట్టుకతో ఒక చేయి, ఒక కాలు పనిచేయదు. ప్రేమల బాగోగులను తండ్రి లింగయ్య చూసేవాడు. ఆయన 15 ఏండ్ల కింద మృతిచెందాడు. అప్పటి నుంచి ప్రేమలకు గడ్డుపరిస్థితులు మొదలయ్యాయి. నా అన్నవారు ఎవరూ పట్టించుకోలేక పోవడంతో నిరాదరణకు గురైంది. కొందరు బంధువులు, గ్రామంలో కొందరి పంచన ఉంటూ జీవనం గడిపింది. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రేకుల షెడ్ వేయించి ఆశ్రయం కల్పించారు. శనివారం రాత్రి రేకుల షెడ్‌లో మంటలు రేగి ఆమె సజీవ దహనమైంది. రాత్రి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ దవాఖానకు తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.